క్లుప్తంగా

నేడు యునాని డే వేడుకలు

కర్నూలు(హాస్పిటల్): వరల్డ్ యునాని డే వేడుకలను ఈ నెల 11వ తేదీన స్థానిక కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ యునాని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఫయాజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీడీఏ జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతి, డీఎంహెచ్వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా యునాని అవగాహన ర్యాలీ, ఉచిత వైద్యశిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు (టౌన్): ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి పట్టణంలోని కరకంబాడీ రోడ్డులో ఉన్న రెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి జె.లక్ష్మీకాంత్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2022 సంవత్సరంలో అసోసియేషన్ చేపట్టిన కార్యక్రమాలు, 2023 సంవత్సరంలో భవిష్యత్తు ప్రణాళిక, పోటీల నిర్వహణ, తేదీల ఖరారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాస్టర్స్ స్విమ్మర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. వివరాలకు 9182147351 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో సత్తా



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా కరాటే క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈ నెల 5, 6 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కర్నూలుకు చెందిన కరాటే క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో గాంధీ, ఉమేరా, సాత్విక్, ఇస్మాయిల్‌లు బంగారు పతకాలు, విక్రమ్ రజత పతకం సాధించినట్లు రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షులు కోలా ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య జిల్లా ఎన్నికల అధికారులను కోరారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వడంతో అధికార పార్టీ నేతలు అర్హత లేని వారిని ఓటర్ల జాబితాలో చేర్చుతున్నారని ఆరోపించారు. అలాగే ఓటర్లకు తాయిలాలు ప్రకటించి కొనుగోలు చేయడానికి చూస్తున్నారన్నారు. ఇలాంటి సంఘనలపై పోలీసులు, ఎన్నికల అధికారులు నిఘా వేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్వో డాక్టర్ బి.రామగిడ్డయ్యకు పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎంసీ.నరసింహులు, కార్యదర్శి ఎన్‌డి. సంపత్‌కుమార్ శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. దీంతో పాటు పీహెచ్‌సీలో జరిగే సెక్టార్ మీటింగ్, ఇతర సమావేశాలు, అత్యవసర విధులు కూడా వారికి ఉంటాయని తెలిపారు. జూమ్ మీటింగ్ రోజు పీహెచ్‌సీలోనే రాత్రి 7 గంటలు కావడం వల్ల మహిళా ఉద్యోగినులు తిరిగి వారి ఇంటికి చేరుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జూమ్ మీటింగ్‌ను మహిళా ఉద్యోగినులకు ఇబ్బందిలేకుండా పనిగంటల సమయంలోనే నిర్వహించాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, అమిగోస్,టైటానిక్,శివవేద, బుట్టబొమ్మ, రైటర్ పద్మభూషన్,
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వారసుడు,అమిగోస్,పాప్‌కార్న్,ఐపీఎల్, రైటర్ పద్మభూషన్,వసంతకోకిల
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, అమిగోస్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, రైటర్ పద్మభూషన్,టైటానిక్
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, పఠాన్, వేదా,వారసుడు
రాజ్ : పాప్‌కార్న్
శ్రీరామ : అమిగోస్
విజయ : వేదా

చోదకా... తస్మాత్ జాగ్రత్త!

- పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి
- వాహనదారుల్లో కొరవడిన అవగాహన
- ఆర్టీఏ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న 27 వేల హెచ్ఎస్ఆర్‌పీలు
- అధికారులకు పట్టుబడితే కేసులు



కర్నూలు: ఇష్టానుసారంగా నంబర్ ప్లేట్లు అమర్చుకుని సంచరించే వాహనదారులకు అడ్డుకట్ట వేసేందుకు కర్నూలు రవాణా శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. వాహనానికి ముందూ వెనుక ఉండే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌పై అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలామంది సినీ నటులు, రాజకీయ నాయకుల ఫొటోలు, ఇతరత్రా బొమ్మలు ఉంచుతున్నారు. మరికొందరు అక్షరాలను గజిబిజీగా రాయిస్తున్నారు. ఇంకొందరు నంబర్లే లేకుండా తిరుగుతున్నారు. ఈ తరహా పోకడలకు అడ్డుకట్ట వేసేందుకు రవాణా శాఖ అధికారులు దృష్టి సారించారు. వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ)లను స్పష్టంగా ప్రదర్శించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించారు. నిబంధనలు ఉల్లంఘించేవారికి జరిమానాలు విధించేలా ఇటు పోలీసులు, అటు రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

కార్యాలయంలో 27 వేల ప్లేట్లు...

చాలామంది వాహనాలకు తమకు నచ్చిన విధంగా స్టిక్కరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు పెట్టుకుని సంచరిస్తున్నారు. వాటి స్థానంలో హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇలా తిరుగుతున్న వాహనాలను కట్టడి చేసేందుకు ఇప్పటికే పోలీసు శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కొంతమంది తమ ధోరణి వీడటం లేదు. జిల్లాలో అన్ని రకాల వాహనాలు కలిపి మొత్తం 11 లక్షల దాకా ఉన్నాయి. అందులో ద్విచక్ర వాహనాలే 8.50 లక్షలు ఉన్నాయి. వీటిని 50 శాతం పైగా అధిక సామర్థ్యం గల ద్విచక్ర వాహనాలను యువకులే ఎక్కువగా నడుపుతున్నారు. రవాణా శాఖ కేటాయించిన హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకోవడానికి వాహనదారులు ముందుకు రాకపోవడంతో దాదాపు 27 వేల ప్లేట్లు కార్యాలయంలో మిగిలిపోయాయి.

హెచ్ఎస్ఆర్‌పీ అమర్చుకోవాల్సిందే...

కొత్త వాహనాలతో పాటు 2015 నుంచి కొనుగోలు చేసిన అన్ని రకాల మోటర్ వాహనాలకు ముందు, వెనుక హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ (హెచ్ఎస్ఆర్‌పీ) తప్పనిసరిగా ఉండాల్సిందే. వాహనాలకు భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలి. వాహనదారుడు aprtacitizen.epragathi.org అనే వెబ్‌సైట్(విభాగం)లోకి వెళ్లి నంబర్ ప్లేట్‌ను బుక్ చేసుకోవచ్చు.

రుసుముల వివరాలు...

ద్విచక్ర వాహనానికి రూ.245, మూడు చక్రాల వాహనాలకు రూ.282, ఎల్ఎంవీ వాహనాలు బొలెరో, టాటా ఏసీ, టాటా మ్యాజిక్, జీపు తదితర వాటికి రూ.619, భారీ వాహనాలకు రూ.649, ట్రాక్టర్ ఇంజన్‌కు రూ.245, ట్రాలీకి రూ.649 చొప్పున చలానా చెల్లించి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లను పొందవచ్చు.

కఠినంగా అమలు చేస్తున్నాం...



ప్రతి వాహనదారుడు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను తప్పనిసరిగా వాహనాలకు అమర్చుకోవాలి. నిబంధనలను కఠినతరం చేశాము. ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నప్పటికీ చాలామంది వాటిని అమర్చుకోవడానికి ముందుకు రావడం లేదు. 2015 నుంచి 2019 వరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కాంట్రాక్టర్ వద్ద 27 వేల హెచ్ఎస్ఆర్‌పీలు మిగిలిపోయాయి. 2019 నుంచి డీలర్ల దగ్గరే కొత్త వాహనాలకు వాటిని అమర్చేలా ఏర్పాటు చేశాము. 2015 కంటే ముందు వాహనాలకు ఏపీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి తప్పనిసరిగా వాటిని వెండర్ వద్ద అమర్చుకోవాలి. ఎఫ్‌సీ, ఇతర ఇన్‌స్పెక్షన్‌లకు వచ్చే వాహనాలకు వీటిని అమర్చేలా చర్యలు తీసుకుంటున్నాము.
–శ్రీధర్, డీటీసీ

సి.హెచ్.కె.ప్రభాకర్‌కు డాక్టరేట్

కర్నూలు(లీగల్): స్థానిక ప్రసూనా న్యాయకళాశాల డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.కె.ప్రభాకర్‌కు చెన్నైలోని జెరూసలేం యూనివర్సిటీ శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలియజేశారు. డాక్టర్ ప్రభాకర్ సమాచార హక్కు చట్టం, మానవ హక్కుల పరిరక్షణపై పలు కార్యక్రమాలను చేపట్టి ప్రజలను చైతన్య పరిచేందుకు విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను అందజేసినట్లు చెప్పారు. డాక్టరేట్ ప్రదానం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివాజీరావు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 13 వరకు విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రధాన శిక్షకులు నటరాజరావు, ఒలింపిక్ సంఘం సభ్యులు అవినాష్, షూటింగ్‌బాల్ కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగం రాకుండా సర్టిఫికెట్లు మార్చేశారు!

- వైద్య ఆరోగ్యశాఖ తీరుపై ఓ అభ్యర్థిని ఆవేదన

కర్నూలు(హాస్పిటల్): తనకు ఉద్యోగం రాకుండా చేసేందుకు, ఇతరులకు ఉద్యోగం కట్టబెట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తన సర్టిఫికెట్ల స్థానంలో ఇతరుల సర్టిఫికెట్లు ఉంచారని మాలతి అనే అభ్యర్థిని ఆరోపించారు. ఈ మేరకు ఆమె గత రెండు రోజుల నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల చుట్టూ తిరుగుతూ తన గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడుమూరు మండలం వేముగోడు గ్రామానికి చెందిన ఆమె గత నెల 12న వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కుక్ కమ్ కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన మెరిట్ జాబితాలో తన మార్కులు తక్కువగా ఉండటంతో అనుమానంతో ఆమె కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆమె దరఖాస్తు తీసి చూడగా ఆమె పదవ తరగతి సర్టిఫికెట్ స్థానంలో ఇతర అభ్యర్థి సర్టిఫికెట్ ప్రత్యక్షమైంది. మాలతికి టెన్త్‌లో 8.5గ్రేడ్ ఉండగా ఇతర అభ్యర్థి సర్టిఫికెట్‌లో మాత్రం కేవలం 238 మార్కులు మాత్రమే ఉన్నాయి. తన మార్కులు అధికంగా ఉన్నాయని భావించి నాకు పోస్టు దక్కకుండా చేసేందుకు ఇతరులకు కట్టబెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఇలా చేశారని, జిల్లా కలెక్టర్ ఈ విషయమై జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కన్నీటిపర్యంతమవుతూ కోరింది. ఈ విషయమై ఆమె కార్యాలయ ఏవో డాక్టర్ నాగప్రసాద్‌ను కలవగా తామింకా ఎవ్వరికీ పోస్టు ఇవ్వలేదని, పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు.

షీబారాణి సేవలు ఎనలేనివి



కార్డియాలజి విభాగంలో పండ్లు పంపిణీ చేస్తున్న ఏలియా, డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్ బాధితులకు స్టాఫ్ నర్సు షీబారాణి అందించిన సేవలు మరిచిపోలేమని, చివరకు ఆమెను ఆ మహమ్మారే పొట్టనబెట్టుకుందని కార్డియాలజి విభాగాధిపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. షీబారాణి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజి విభాగంలో హృద్రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ రోగులకే గాకుండా సుదీర్ఘకాలంగా కార్డియాలజి విభాగంలో షీబారాణి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డాక్ ట్యుటోరియల్స్ అధినేత, షీబారాని భర్త ఏలియా, ఈసీటీ టెక్నీషియన్లు రమేష్, శివుడు, తిరుమలరావు, జయప్రకాష్ పాల్గొన్నారు.

వర్మీ యూనిట్ షెడ్లు మరింత మెరుగుపడాలి



పాణ్యంలో పండ్ల దుకాణాల వద్ద వ్యర్థాలను సేకరిస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రతి గ్రామం శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండేందుకు వర్మీ యూనిట్ షెడ్లు మరింత మెరుగుపడాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. శుక్రవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పాణ్యం వర్మీ యూనిట్ వద్ద ఈఓఆర్డీలకు, గ్రామాల కార్యదర్శులకు, క్లాప్ సిబ్బందికి, షెడ్ నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ శుభ్రతకు మొదటి అడుగు ఇంటి నుంచే పడాలన్నారు. తడి, పొడి చెత్త వేరుగా ఉంచి క్లాప్ సిబ్బందికి ఇవ్వాలన్నారు. అందుకు ఇప్పటికే ఇంటికి రెండు బుట్టలను అందజేశామన్నారు. తడి చెత్తను ఎండబెట్టడం, పొడి చెత్తను వానపాములు ఉన్న ప్రత్యేక షెడ్‌లో ఉంచడం ద్వారా వర్మీ ఎరువు తయారవుతుందన్నారు. దీని వలన గ్రామ పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం శిక్షణకు వచ్చిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. పండ్ల దుకాణాల వద్దకు తీసుకెళ్లి తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తారనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, గ్రామ సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కిస్తీ

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులో శ్రీఅల్లిహుసేన్ స్వామి వారి ఉరుసు సందర్భంగా శుక్రవారం సాయంత్రం కిస్తీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామస్తులు ఫలహారం బండ్లను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చి అక్కడ స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవాలను తిలకించేందుకు వర్కూరువాసులే గాకా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది.

సచివాలయాలను తనిఖీ చేయండి



హాజరు పట్టిక పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు (టౌన్): సచివాలయాల్లో సేవలను పెంచేందుకు స్పెషల్ ఆఫీసర్లు నిత్యం వాటిని తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న 86,87,88 వార్డు సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. వలంటీర్లు, సిబ్బంది తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారంలో ఒకరోజు వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది సమీక్షా సమావేశం నిర్వహించుకొని సచివాలయ సర్వీసులను మెరుగుపర్చుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో వసతిగృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సరైన రీతిలో అందిస్తున్నారా.. లేదా తనిఖీ చేయాలన్నారు. పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్వీ.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిరసన దీక్ష

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతనాలను ఇవ్వాలని కోరుతూ నేడు (శనివారం) శ్రీకృష్ణదేవరాయల్ సర్కిల్‌లో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చామల అనిల్ వెంకట ప్రసాదు రెడ్డి కూర్చుంటారని, కావున పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

ఆర్అండ్‌బీ ఈఈ బాధ్యతల స్వీకరణ



బీ సురేష్‌బాబు

కర్నూలు(అర్బన్): రోడ్లు భవనాల శాఖ కర్నూలు ఈఈగా బీ సురేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఏవీ శ్రీధర్‌రెడ్డిని నంద్యాల జిల్లాకు, అక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబును ఇక్కడకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈఈగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌బాబు 1992లో హైదరాబాద్‌లో జేఈగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి పదోన్నతిపై డీఈఈగా ప్రొద్దుటూరు, చిత్తూరు లో విధులు నిర్వహించారు. అనంతరం పదోన్నతిపై ఈఈగా నంద్యాలలో పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆర్అండ్‌బీ ఎస్ఈ కే నాగరాజును మర్యాద పూర్వకంగా కలిసి బాధ్యతలు చేపట్టారు. నూతన ఈఈ సురేష్‌బాబును కర్నూలు, కోడుమూరు డీఈఈలు పీ విజయభారతి, శివరుద్ర, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న జిల్లా వృత్తివిద్యాధికారి కె.జమీర్ బాషా

కర్నూలు సిటీ: విద్యార్థులకు ఇంటర్మీడియెట్ అనేది కీలకమైందని, క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా వృత్తివిద్యాధికారి కె.జమీర్ బాషా అన్నారు. శుక్రవారం కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీ 27వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఓ ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. రాబోయే పరీక్షలకు సిద్ధమయ్యే వారు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న ప్రసంగించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 2020 పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ మాజీ రిజిస్ట్రార్‌కు నివాళి



కె.శ్రీనివాసరావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న వర్సిటీ వీసీ తదితరులు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కె.శ్రీనివాసరావు అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. ఇందులో భాగంగా శుక్రవారం ఆర్‌యూలో ఆయన చిత్ర పటానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఆకెపోగు ఆనంద రావు, రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానందా పుచ్చా, వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య విశ్వనాథరెడ్డి, పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు, టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తూరు సుబ్బరాయుడికి ఆదాయం

పాణ్యం: వివిధ వేలాల ద్వారా మండల పరిధి లోని కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి కి ఆదాయం సమకూరిందని ఈఓ రామక్రిష్ణ తెలిపారు. టెంకాయలు, పూలు, గాజులు, పటముల విక్రయాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కుల ను రూ.14.40 లక్షలకు మైదుకూరు పట్టణానికి చెందిన అంజనమ్మ, పూల విక్రయ హక్కులను రూ.1.78 లక్షలకు తూర్పు గోదావరికి చెందిన సూర్యనారాయణ, గాజులు, పటముల విక్రయ హక్కులను రూ.25 వేలకు కాల్వబుగ్గకు చెందిన వరలక్ష్మి దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. వేలంపాటల్లో పర్యవేక్షణ అధికారి నాగిరెడ్డి, గ్రామ పెద్దలు క్రిష్టారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాణ్యంలో అభివృద్ధి 'వెలుగులు'

- కందికాయపల్లెలో రెండు విద్యుదుత్పాదక పరిశ్రమలు
- గత ఏడాది అనుమతులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ముమ్మరంగా సాగుతున్న సర్వే పనులు
- పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు లభించనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కందికాయల్లె బోర్డు



భూములను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి



సోలార్ పరిశ్రమకు కేటాయించిన భూములు

పాణ్యం: పారిశ్రామికంగా పాణ్యం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పాటైన మండలానికి మరో రెండు భారీ విద్యుదుత్పాదన పరిశ్రమలు రానున్నాయి. ఇందుకు సంబంధించిన భూ సర్వే పనులు ప్రస్తుతం చకచకా జరుగుతున్నాయి. ఆలమూరు రెవెన్యూ గ్రామమైన కందికయపల్లె గ్రామం మండల కేంద్ర పాణ్యానికి 24 కిలోమీటర్ల దూరంలో కొండపై ఉంటుంది. ఇక్కడ 2,850 ఎకరాల్లో ఏఎం గ్రీన్‌కో సంస్థ సోలార్, విండ్ పరిశ్రమలను నెలకొల్పనుంది. ఇటీవలే జేసీ నిషాంతి ఆయా పరిశ్రమలకు కేటాయించిన భూములను పరిశీలించారు.

గత ఏడాదే సర్కారు అనుమతులు:

గత ఏడాది ప్రభుత్వం ఏఎం గ్రీన్ కో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు రెండు విద్యుత్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఇందులో ఒకటి సోలార్, మరొకటి విండ్ (పవన విద్యుత్). సోలార్ ద్వారా రోజుకు 700 మెగావాట్లు, విండ్ ద్వారా 300 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. కాలుష్య రహిత పరిశ్రమలైన ఈ రెండింటికి ఏఎం గ్రీన్‌కో రూ. 4,500 కోట్ల మేరా పెట్టుబడులు పెట్టనున్నట్లు సమాచారం.

వెయ్యి మందికి ఉపాధి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన జీవో ద్వారా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్థానికులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. దాదాపు 70 శాతం మేర ఉద్యోగాలు ఇస్తారు. ఈ లెక్కన కొత్తగా ఏర్పాటయ్యే సోలార్, విండ్ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మంది వరకు ఉపాధి లభించే అవకాశం ఉండటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

గత ఏడాది పిన్నాపురంలో భారీ పరిశ్రమకు శ్రీకారం

మండలంలోని పిన్నాపురం గ్రామంలో సోలార్, విండ్ హైడ్రో పవర్ తయారీ పరిశ్రమకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మే 17న శంకుస్థాపన చేశారు. 5,230 మెగావాట్ల విద్యుదు ఉత్పత్తి చేసే ఈ పరిశ్రమకు ఏఎం గ్రీన్‌కో ఎనర్జీ ప్రైయివేట్ లిమిటెడ్ రూ. 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది.

సర్వే ముమ్మరం చేశాం



ఏఎం గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు కేటాయించే భూములకు సంబంధించి సర్వే వేగంగా జరుగుతుంది. మండల సర్వేయర్ నాగప్రసాద్‌తో పాటు మరో రెండు విలేజ్ సర్వేయర్ల టీమ్‌ల ద్వారా ఈ పనులు చేస్తున్నాం.ప్రభుత్వ భూమికి సంబంధించి 1000 ఎకరాల సర్వే రిపోర్టును పంపించాం. త్వరలో ఇతర భూములకు సంబంధించిన సర్వే రిపోర్టు పంపిస్తాం.
–మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్

పరిశోధనల వైపు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి రామగిడ్డయ్య

కర్నూలు సిటీ: ఏ క్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పి.రామగిడ్డయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్యరంగంలో కీలకమైంది ఫార్మసీనేనని అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఏడాదికేడాది పెరుగుతున్నాయని, పరిశోధనల వైపు విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరక్టర్ డా.స్టెల్లా సతీష్, కాలేజీ ప్రిన్సిపాల్ డా.జె.రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాములు

కల్లూరు: మండల పరిధిలోని కల్లూరు అర్బన్ పందిపాడు గ్రామానికి చెందిన శివదీక్షధారులు శుక్రవారం ఇరుముడులతో శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతురావు చౌదరి దంపతులు శివన్న తోటలో వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు.